క్లుప్తంగా

ద్వారకాతిరుమలలో భక్తుల రద్దీ



వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిండిపోవడంతో బయట పెద్ద ఎత్తున బారులు తీరిన భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం సైతం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, అనివేటి మండపం, జంటగోపురాలు, తూర్పు రాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, అన్నదానం విభాగాలు భక్తులతో పోటెత్తాయి. దర్శనం క్యూలైన్లు, క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోవడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయ ఆవరణలో బారులు తీరారు. అలాగే భక్తుల వాహనాలతో పార్కింగ్ ప్రదేశాలు, ఘాట్ రోడ్లు నిండిపోయాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. దర్శనం టికెట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా స్వామివారికి రూ.32 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవాదృక్పథం అభినందనీయం

కొవ్వూరు: లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. లయన్స్ క్లబ్ కొవ్వూరుశాఖ ఆరికిరేవుల గ్రామంలోని వేంకటేశ్వర స్వామి అన్నదాన మండపానికి ఆదివారం పది భోజనం టేబుళ్లను బహూకరించింది. లయన్ జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గూడ ప్రసాదరావు సౌజన్యంతో వీటిని ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకట్రావు ప్రకటించారు. గ్రామంలోని 24 మంది వాలీబాల్ క్రీడాకారులకు క్రీడాదుస్తులు, వాలీబాల్ కిట్లు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కార్యదర్శి పెనుమాక జయరాజు, సభ్యులు పొట్రు శ్రీనివాస్, సూర్యదేవర రంజిత్, చావా శ్రీనివాస్, ఎండీ హుస్సేన్, ఉప్పులూరి రామకృష్ణ, సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో అన్న సమారాధన

చాగల్లు: హనుమాన్ జయంతి ఉత్సవాల ముగింపులో భాగంగా చాగల్లు మెయిన్ రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.

పిడుగు పడి రెండు గేదెల మృతి



గోపాలపురం బీసీ కాలనీలో పిడుగు పడి మృతి చెందిన గేదెలు

గోపాలపురం: అకాల వర్షం, భారీ ఈదురు గాలులతో కూడిన ఉరుములు, మెరుపులకు పిడుగు పడి రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనలో గోపాలపురం బీసీ కాలనీకి చెందిన మరీదు వెంకట దుర్గాప్రసాద్‌కు చెందిన రెండు పాడి గేదెలూ అక్కడికక్కడే మృతి చెందాయి. నష్టం విలువ సుమారు రూ 1.50 లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. తన కుటుంబ జీవనం ఆ రెండుపాడి గేదెల మీదే ఆధార పడినందున ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

అంతరిస్తున్న ఆంధ్ర కల్పవృక్షం

- ప్రమాదకరమైన వృత్తి కల్లుగీత
- కనుమరుగవుతున్న తాటిచెట్లు
- రియల్ ఎస్టేట్ పేరుతో నరికివేత

చాగల్లు: తాడిచెట్టును ఆంధ్ర కల్ప వృక్షంగా పిలుస్తారు. తాటికల్లును వేసవిలో చాలామంది ఇష్టంగా సేవిస్తారు. కల్లును శీతల పానీయంగా తయారు చేసి పామ్‌కోలాగా విక్రయిస్తున్నారు. తాటికల్లును మరగించి బెల్లం తయారు చేస్తారు. కల్లుతో తయారు చేసే తాటిబెల్లంలో ఔషధ గుణాలు ఉండడంతో చాలా మంది ఇష్టంగా తింటారు. అయితే కల్లుగీత కార్మికుల జీవనం మాత్రం ప్రమాదభరితమైంది. 20 నుంచి 30 అడుగుల ఎత్తు ఉండే చెట్లు ఎక్కి, దిగుతూ కల్లు గీసి ఉపాధి పొందుతున్నారు. కొవ్వూరు నియోజకవర్గం, చాగల్లు మండలంలోని చిక్కాల, ఊనగట్ల, చాగల్లు, మీనానగరం గ్రామాల్లో సుమారు వెయ్యి కుటుంబాలు గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. గతంలో దీనికి రెండు రెట్లు అధికంగా కలూ కార్మికులు ఉండేవారు. కల్లు సీజన్ ఫిబ్రవరి నుంచి మే వరకూ ఉంటుంది.ఈ సీజన్‌లో గరువు పొలాల్లో పాకలు వేసుకుని కుటుంబ సమేతంగా పనులు చేస్తూ జీవనం సాగించేవారు. ప్రస్తుతం రవాణా సాధనాలు అందుబాటులోకి రావడంతో వారి పని సులభతరమైంది. బంజరు భూములైన గరువు పొలాల్లో గతంలో తాటిచెట్లు ఎక్కువగా ఉండేవి.

కనుమరుగవుతున్న తాడి చెట్లు

నియోజకవర్గ పరిధిలోని చాగల్లు, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లో తాటిచెట్లు కనుమరుగవుతున్నాయి. ఉన్న కొద్దిపాటి చెట్లనూ అక్రమంగా నరికేస్తున్నారు. తాటిచెట్లు అంతరించిపోవడంతో తాటాకులు, తాటి కమ్మలు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఈ చెట్ల నుంచి లభించే తాటిముంజులు, తాటికాయలకు మంచి డిమాండ్ ఉంది. చాగల్లు మండలంలో ప్రతి గ్రామంలోను తాటిచెట్లు ఉన్నాయి. వాటిని ఎవరూ నాటలేదు. తాటిచెట్ల నుంచి కింద పడిన పండ్ల నుంచి మొలకలు వచ్చి, అవి చెట్లుగా పెరుగుతున్నాయి. కాగా గ్రామాల్లో భూములు కొంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు తాటిచెట్లను తొలగిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రోజు చెబుతున్న అధికారులు, పాలకులు ప్రకృతి సంపద ఇలా నాశనం అవుతున్నా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



మీనానగరంలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తున్న కార్మికుడు



పొలంలో తాడిచెట్ల తల భాగాలు తొలగించిన దృశ్యం

తాటికల్లుతో బెల్లం తయారీ

చెరకు రసాన్ని మరిగించి బెల్లం తయారు చేసినట్టుగానే తాటిచెట్ల నుంచి లభించే కల్లును మరిగించి బెల్లం తయారు చేస్తారు. ఔషధ గుణాలు కలిగిన ఈ బెల్లాన్ని తినేందుకు చాలామంది ఇష్టపడతారు. తాటిబెల్లం కిలో రూ.300 రేటుకు విక్రయిస్తారు. ఈ బెల్లాన్ని బ్రాందీ, సారా తయారీ కోసం ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. చెట్లు అంతరించిపోయి కల్లు తగ్గిపోవడంతో బెల్లం తయారీకి వంట చెరకు లభించక బెల్లం తయారీపై ఆసక్తి చూపడం లేదు. ప్రకృతి సిద్ధమైన తాటికల్లును మద్యం ప్రియులే కాకుండా ఇతరులు కూడా ఇష్టంగా సేవిస్తారు. వేసవిలో గ్రామాల్లో తాటికల్లు అమ్మకాల కోసం దుకాణాలు దర్శమిస్తాయి. లీటరు చెంబు రూ.30 రేటుకు విక్రయిస్తున్నారు. కొవ్వూరు, నిడదవోలు పరిసర పట్టణాల నుంచి కూడా అధిక సంఖ్యలో కల్లు సేవించడానికి ఇక్కడకు వస్తుంటారు.

ప్రమాదకరమైన వృత్తి

కల్లు గీత కార్మికులకు సీజన్‌లో రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకూ ఆదాయం లభిస్తుంది. నాలుగు నెలల సీజన్‌లో ఖర్చులు పోను వాతావరణం అనుకూలిస్తే ఆదాయం బాగానే ఉంటుంది. వర్షాలు కురిస్తే మాత్రం దిగుబడి, డిమాండ్ తగ్గి గీత కార్మికులు తీవ్రంగా నష్టపోతారు. తాటిచెట్లు ఎక్కి దిగడం చాలా ప్రమాదకరమైన వృత్తి. చెట్టు నుంచి పడి అంగవైకల్యం పొందినవారు, ప్రాణాలు కోల్పోయిన గీత వృత్తికార్మికులు ఎందరో ఉన్నారు. క్షతగాత్రులకు, మృతుల కుటుంబాలకు ఎలాంటి నష్టపరిహారం అందడం లేదు అని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, స్వయం ఉపాధికి రుణాలు, పింఛన్లు మంజూరు చేయాలని గీత కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

తాటిచెట్లపై ఆధారపడి జీవిస్తున్న గీత కార్మికులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి. గీత వృత్తి చేస్తున్న చాలా మందికి గుర్తింపు కార్డులు లేవు. గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల గీత కార్మికుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదు.

– కట్టా శ్రీనివాసరావు, గీత కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మీనానగరం, చాగల్లు మండలం

శ్రీవారి పథకాలకు రూ.5 లక్షల విరాళాలు



దాత రోజారమణికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలోని పలు పథకాలకు కొందరు భక్తులు ఆదివారం రూ. 5,01,232 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా ఒక అజ్ఞాత భక్తుడు విమానగోపుర స్వర్ణమయ పథకానికి రూ. 3 లక్షలు అందించగా, బొప్పన సురేష్ అనే భక్తుడు నిత్యాన్నదాన పథకానికి రూ. 50 వేలు, సికింద్రాబాద్‌కు చెందిన వారణాసి ఆదిశేషు అనే దాత నిత్యాన్నదాన పథకానికి రూ. 50,116 విరాళంగా సమర్పించారు. అలాగే ఉండ్రాజవరం మండలం పాలంగికి చెందిన అల్లక రోజారమణి ప్రాణదాన ట్రస్టుకు రూ. 1,01,116 అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ రమణరాజులు విరాళం బాండ్ పత్రాలను అందించి, స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం



అట్లపాడులో విద్యుత్ వైర్లపై పడిన తాటిచెట్టు

నిడదవోలు రూరల్: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల తీవ్రతకు అట్లపాడు గ్రామంలో విద్యుత్ తీగలపై తాటిచెట్టు కూలిపోయింది. దీంతో సమిశ్రగూడెం, అట్లపాడు, డి.ముప్పవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల పిడుగుల పడడంతో ఆ శబ్దాలకు ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందారు.

ఇసుక అందుబాటులోకి తేవాలి

కొవ్వూరు: గోదావరి నదిలో ఇసుక సేకరించే పడవ కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు అన్ని వర్గాల వారికీ ఇసుక అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కోరారు. ఆ సంఘం నాయకులు ఆదివారం కొవ్వూరులో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. గత ప్రభుత్వం నిలిపివేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ జాతీయ చట్టం బోర్డును పునరుద్ధరించాలని కోరారు. త్వరలో నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే ముప్పిడి వారికి హామీ ఇచ్చారు. జిల్లా సంఘం గౌరవా ధ్యక్షుడు మైగాపుల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వల్లేపల్లి నరసింహమూర్తి, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మద్దుకూరి దొరయ్య, జొన్నల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు, మానికిరెడ్డి హరిబాబు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి

- రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్
- వాసవీ మాత రథయాత్రను ప్రారంభించిన మంత్రి

నిడదవోలు: ప్రతి ఒక్కరూ భక్తి భావంతో ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి రథయాత్రను ఆయన ప్రారంభించారు. చినకాశీ రేవు నుంచి ప్రారంభమైన రథయాత్ర గణేష్‌సెంటర్, గణపతి సెంటర్, సంత మార్కెట్ సెంటర్, బస్టాండ్ సెంటర్ల మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకుంది. అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు తరలి వచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు బొచ్చులక్ష్మణరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కేదారిశెట్టి రవికుమార్, టీడీపీ, జనసేన పట్టణ శాఖల అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కారింకి సాయిబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి రథయాత్ర ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

సాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు

- కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- కుమారదేవం ఎత్తిపోతల నుంచి సాగునీరు విడుదల

కొవ్వూరు: మండలంలోని కుమారదేవం ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి చెందిన ఒక పంప్ స్విచ్‌ను ఆదివారం ఆయన ఆన్ చేసి ఆయకట్టు భూములకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా డెలివలీ పాయింట్ వద్ద నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు.1977లో ప్రారంభించిన పథకం కావడంతో ఆయకట్టుదారులు అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారన్నారు. తెలుగుదేశం పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకుడు పిక్కి నాగేంద్ర, జనసేన పార్టీ మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్తిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ బూరుగుపల్లి వీర్రాఘవులు పాల్గొన్నారు.

పైడిమెట్ట ఎత్తిపోతల పథకం నుంచి..

తాళ్లపూడి: మండలంలోని పైడిమెట్ట ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను ఖరీఫ్ సాగు కోసం ఆదివారం ఆయకట్టు భూములకు విడుదల చేశారు. మండలంలోని అన్నదేవరపేటకు చెందిన పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య, రైతులు పూజలు నిర్వహించాక, మోటార్ స్విచ్ ఆన్ చేసి నీటిని కాలువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ఆయకట్టుకు సక్రమంగా నీరు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. ప్రతి ఒక్క రైతూ బకాయిలు సకాలంలో చెల్లించాలన్నారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు మూడు వేల ఎకరాలకు నీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఈ ఎత్తిపోతల పథకం మాజీ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, జీవీ ప్రసాద్, ముళ్ళపూడి రామచంద్ర రావు, కూచిపూడి హనుమంతరావు, కోరారు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కుమారదేవం ఎత్తిపోతల పథకం మోటార్ స్విచ్ ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

నెలటూరులో అపూర్వ సమ్మేళనం



నెలటూరు కల్యాణ మంటపంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

చాగల్లు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1977–78 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నెలటూరు గ్రామంలోని సీతారామస్వామి కల్యాణ మంటపంలో సందడిగా జరిగింది. పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా కార్యక్రమానికి హాజరై, సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా అప్పటి తమ గురువులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో కాలక్షేపం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెంజర్ల గణేష్, షేక్ గఫూర్, ఆళ్ల చంద్రశేఖర్, ఉషారాణి, జయలక్ష్మి, ఇంద్రారాణి, జయకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వానరం దాడిలో వృద్ధురాలికి గాయాలు

చాగల్లు: కోతి దాడిలో ఓ వృద్ధురాలికి గాయాలయ్యాయి. మీనానగరం గ్రామంలోని కొత్తపేటకు చెందిన శాంతమ్మ అనే వృద్ధురాలు ఆదివారం తన ఇంటి ఆవరణలో పని చేస్తుండగా కోతి చొరబడి ఆమెపై దాడి చేసింది. ఆమె చేతికి తీవ్ర గాయాలయ్యాయి. వారం రోజులుగా గ్రామంలో కోతుల గుంపు సంచరిస్తుండడంతో జనం భయభ్రాంతులకు గురవుతున్నారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఫాదర్స్ డే



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న రొటేరియన్స్

నిడదవోలు: సమాజంలో నిరాదరణకు గురవుతున్న మానసిక దివ్యాంగులను ఆదరించాలని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు కీర్తి అంజనేయులు అన్నారు. ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా శంకరాపురం మానసిక దివ్యాంగుల పాఠశాల (హృదయాలయం)లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలకు శుభాకాంక్షలు తెలుపుతూ పలకలు, బలపాలు, కిరాణా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గమిని కుమార్, గుంటుపల్లి శివకుమార్, గొన్నా బత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్యశర్మ, ఆకుల రామచంద్రరావు, యాసరపు రామకృష్ణ, గోపిరెడ్డి శ్రీనివాస్, హృదయాలయం నిర్వాహకులు దండే గణేష్, రొటేరియన్లు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ముత్యాలమ్మ జాతర

- జనంతో కిటకిటలాడిన బందపురం
- ఉక్కబోతకు అల్లాడిన ప్రజలు

దేవరపల్లి: బందపురం గ్రామదేవత ముత్యాలమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. గత 28 రోజులుగా అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి జాతర నిర్వహించగా, ఆదివారం అమ్మవారికి గ్రామస్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. 12 ఏళ్లకు ఒకసారి జాతర జరగడంతో బందపురం జనసంద్రమైంది. ప్రతి ఇంటా బంధువుల సందడి నెలకొంది. సుమారు లక్ష మంది భక్తులు ఆదివారం నాటి జాతరకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు జాతరకు హాజరై బంధువులు, మిత్రులు ఏర్పాటు చేసిన విందు స్వీకరించారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా దేవరపల్లి సీఐ పి.బాలసురేష్‌బాబు పర్యవేక్షణలో ఎస్సై కె.శ్రీహరిరావు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం సాయంత్రం వరకూ గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.



బందపురంలో ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కుంకుళ్లమ్మకు స్నపన నిర్వహిస్తున్న అర్చకులు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గ్రామంలో రెండు రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్టు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడినట్టు గ్రామస్తులు తెలిపారు.విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఉక్కపోత వాతావరణంతో కూడిన వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో గ్రామానికి వచ్చిన బంధువులు, మిత్రులు అల్లాడిపోయారు. పలు ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి ఏర్పడింది. పక్క గ్రామాల నుంచి మంచినీటి ట్యాంకులను తెచ్చుకున్నట్టు గ్రామస్తులు తెలిపారు. జాతర అని తెలిసి కూడా అధికారులు ఎటువంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ముత్యాలమ్మ జాతరలో కాళికామాతల వేషధారణలు

ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

కన్నులపండువగా కుంకుళ్లమ్మకు నవకలశ స్నపన

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ వారి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న వార్షికోత్సవ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. అందులో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 9 గంటలకు అమ్మవారి మూలవిరాట్టుకు, అలాగే ఉత్సవ మూర్తులకు నవకలశ స్నపనను అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. అనంతరం శ్రీ చక్రార్చన, సప్తశతి పారాయణ, హోమాలు జరిపారు. ఆ తరువాత మహా పూర్ణాహుతి వేడుకను నేత్రపర్వంగా సాగింది. ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నల్లజర్ల సోమాలమ్మ సంబరం

నల్లజర్ల: నల్లజర్ల గ్రామ దేవత సోమాలమ్మ వారికి గ్రామస్తులు ఆదివారం సంబరం నిర్వహించారు. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని తలపై పెట్టుకొని ఇంటింటా తిరిగారు. పసుపు నీళ్ల వారపోసి అమ్మవారికి స్వాగతం పలికి, కొబ్బరికాయలు కొట్టారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ప్రార్థిస్తూ రైతులు చలివిడి, పానకాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.